సంపుటి :02 సంచిక :275 పేజీలు :06

వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శుక్రవారం 09, జనవరి 2026

# పటిష్ట ఏర్పాట్లు చేయాలి



- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఐనవోలు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించి,
- పనుల పురోగతిని సమీక్షించిన జిల్లా కలెక్టర్



## నారాయణగిరి..
# హతవిధీ!

- అక్రమ మైనింగ్ గుప్పిట్లో చారిత్రక గ్రామం
- రేయింబవళ్లు అక్రమంగా గ్రానైట్, క్రషర్స్, మైనింగ్
- తుడిచిపెట్టుకుపోతున్న బౌద్ధ, జైన ఆనవాళ్లు
- ప్రాభవం కోల్పోతున్న చారిత్రక వైభవం
- భారీ వాహన రాకపోకల వల్ల ప్రమాదాలు
- ఇటీవల కలెక్టర్‌ను ఆశ్రయించి గోడు వెళ్లబోసుకున్న గ్రామస్తులు

2

శతాబ్దాల చరిత్ర కలిగి బౌద్ధ, జైన ఆనవాళ్లు కలిగిన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి అక్రమ గ్రానైట్, మైనింగ్, క్రషర్ల ధాటికి తన ప్రాభవాన్ని కోల్పోతుఉన్నది. చారిత్రక వైభవంగా నానాటికీ కనుమరుగవుతున్నది. తన అస్తిత్వాన్ని కోల్పోతున్నది. కాకతీయుల కంటే పూర్వపు కాలానికి చెందిన అరుదైన శిల్పాలు, శిలాశాసనాలు, ధ్యాన ముద్రలు యంత్రాల రాపిడిలో విచ్ఛిన్నమవుతున్నాయి.

– అక్షరదర్బార్, హనుమకొండ




## ప్రపంచానికి చాటేలా
# మేడారం మహా జాతర

5

- సమ్మక్క- సారక్కల ఘన కీర్తిని చాటిచెప్తాం

"తెలంగాణ కుంభమేళా మేడారం జాతరను విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సమ్మక్క–సారలమ్మల వైభవం, ఆదివాసీల ఆచారాలు ఉట్టిపడేలా రూ.251 కోట్లతో మేడారంలో భారీ అభివృద్ధి పనులు చేపడుతోంది. ఈ నెల 19న సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనుండగా.. కోట్లాది మంది వచ్చే మహాజాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు." – అక్షరదర్బార్, ములుగు

- ఆదివాసీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుకలు
- జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం
- 19న సీఎం చేతులమీదుగా మేడారం అభివృద్ధి పనులు ప్రారంభం
- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క
- మేడారంలో మీడియా ఆత్మీయ సమ్మేళన సమావేశం

# హంతకుల కన్నా.. వాహనదారులే డేంజర్!



- నిబంధనలు పాటించకపోవడమే ప్రాణాంతకం
- 9 లక్షల మందికి జరిమానాలు విధించాం
- మత్తుకు బానిసై భవిష్యత్ పాడుచేసుకోవద్దు
- బైక్ ర్యాలీలో వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

2

# ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- ఇంటి నంబర్ కేటాయింపునకు లంచం డిమాండ్
- బాధితుడి నుంచి రూ.6 వేలు తీసుకుంటుండగా పట్టివేత
- సూర్యాపేట జిల్లా గానుగబండలో ఘటన

5





## వచ్చే నెలలో
# సీఎం వచ్చే ఛాన్స్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- కొడవటంచ దేవస్థానం అభివృద్ధి పనుల పరిశీలన

4



# నారాయణగిరి.. హతవిధీ!

- అక్రమ మైనింగ్ గుప్పిట్లో చారిత్రక గ్రామం
- రేయింబవళ్లు అక్రమంగా గ్రానైట్, క్రషర్స్, మైనింగ్
- తుడిచిపెట్టుకుపోతున్న బౌద్ధ, జైన ఆనవాళ్లు
- ప్రాభవం కోల్పోతున్న చారిత్రక వైభవం
- భారీ వాహన రాకపోకల వల్ల ప్రమాదాలు
- ఇటీవల కలెక్టర్ ను ఆశ్రయించి గోడువెళ్లబోసుకున్న గ్రామస్తులు

అక్షరదర్బార్, హనుమకొండ : శతాబ్దాల చరిత్ర కలిగి బౌద్ధ, జైన ఆనవాళ్లు కలిగిన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి అక్రమ గ్రానైట్, మైనింగ్, క్రషర్ల ధాటికి తన ప్రాభవాన్ని కోల్పోతుఉన్నది. చారిత్రక వైభవంగా నానాటికీ కనుమరుగవుతున్నది. తన అస్తిత్వాన్ని కోల్పోతున్నది. కాకతీయుల కంటే పూర్వపు కాలానికి చెందిన అరుదైన శిల్పాలు, శిలాశాసనాలు, ధ్యాన ముద్రలు యంత్రాల రాపిడిలో విచ్ఛిన్నమవుతున్నాయి. ప్రకృతి ప్రసాదించిన గుట్టలను పిండి చేస్తున్న ఈ తవ్వకాలు పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. అంతేకాదు.. స్థానికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. తెలంగాణ ప్రాచీన నాగరికతకు ఆనవాళ్లుగా నిలిచిన వారసత్వ



సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అధికారుల అలసత్వం కారణంగా భవిష్యత్ తరాలకు అందాల్సిన ఈ చారిత్రక నిధి శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదంలో పడి ఉంది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి ఒకప్పుడు ఆధ్యాత్మికతకు, చారిత్రక వైభవానికి నిలయంగా వెలుగొందింది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ప్రాంతం ఇప్పుడు అక్రమ మైనింగ్, గ్రానైట్ క్రషర్ల ధాటికి కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. గ్రామ శివారులోని నరసింహ స్వామి గుట్ట, మధ్యలోని బోడు, బొడగుట్ట ప్రాంతాల్లో అపారమైన చారిత్రక సంపద దాగి ఉంది. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో బౌద్ధ, జైన మతాలు వర్ధిల్లిన కాలానికి సంబంధించిన కీలక ఆధారాలు ఇక్కడ లభ్యమయ్యాయి. జైనులు, బౌద్ధ భిక్షువులు ధ్యానం చేసిన ధ్యాన ముద్రలు, ప్రాచీన గుహలు, బుద్ధుడి పాదముద్రలు వంటి గుర్తులు ఇప్పటికీ అక్కడ సజీవంగా కనిపిస్తున్నాయి. అయితే,

### - కలెక్టర్ ను ఆశ్రయించిన గ్రామస్తులు

ఈ నేపథ్యంలోనే గ్రామానికి చెందిన బాధితులు, సామాజిక కార్యకర్తలు ఇటీవల హనుమకొండ కలెక్టర్ ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అక్రమ మైనింగ్ ను వెంటనే నిలిపివేసి, పురావస్తు శాఖ అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గుట్టల మధ్య ఉన్న శిలాశాసనాలను, ఆధ్యాత్మిక గుర్తులను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, ఈ ప్రాంతాన్ని వారసత్వ సంపదగా ప్రకటించాలని కోరుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు తమ గ్రామ చరిత్రను భావి తరాలకు అందించేందుకు మైనింగ్ మాఫియా నుండి నారాయణగిరిని కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ ప్రాంతం చుట్టూ ఇప్పుడు అక్రమ మైనింగ్ మాఫియా పంజా విసరడంతో అరుదైన చారిత్రక సంపద చెదిరిపోతున్నది.

### - గ్రామ చారిత్రక వైభవం..

నారాయణగిరి గుట్టలపై ఉన్న నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో కాకతీయుల కంటే పూర్వపు కాలానికి చెందిన శిల్ప కళా రీతులు కనిపిస్తాయి. ఇక్కడ ఒక భారీ శిలాశాసనంతో పాటు, 18 మంది దేవతల వరుస శిల్పాలు కలిగిన అరుదైన శిల కూడా ఉంది. గతంలో చరిత్రకారులు నిర్వహించిన పరిశోధనల్లో ఇక్కడ జైన తీర్థంకరుడైన వర్ధమాన మహావీరుడి విగ్రహంతో పాటు, జైన మత చిహ్నాలు కలిగిన 'లింగం బోడు' వంటి ప్రాంతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రాంతం కేవలం ఒక ఆధ్యాత్మిక క్షేత్రమే కాకుండా, తెలంగాణ ప్రాచీన నాగరికతకు ఒక నిలువుటద్దంగా నిలుస్తోంది. ఇన్ని ప్రత్యేకతలున్న ప్రాంతాన్ని పురావస్తు శాఖ గుర్తించి రక్షించాల్సింది పోయి, మైనింగ్ అనుమతులకు దారి చూపడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### - ఇష్టారీతిన తవ్వకాలు

ప్రస్తుతం ఈ ప్రాంతంలో సాగుతున్న అక్రమ గ్రానైట్ తవ్వకాల వల్ల పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోంది. అనుమతులకు మించి యంత్రాలతో గుట్టలను పిండి చేస్తుండటంతో చారిత్రక ఆనవాళ్లు శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది. మైనింగ్ కంపెనీల నుండి నిత్యం వందలాది భారీ వాహనాలు గ్రామం గుండా వెళ్తుండటంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీనివల్ల సామాన్య ప్రయాణికులతో పాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ క్రషర్ల నుంచి వచ్చే దుమ్ము, ధూళి వల్ల స్థానికులు శ్వాసకోశ వ్యాధులతో సతమతమవుతున్నారు. అభివృద్ధి పేరుతో సాగుతున్న ఈ విధ్వంసం తమ ఊరి ఉనికికే ప్రశ్నార్థకం చేస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పటిష్ట ఏర్పాట్లు చేయాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

## ఐనవోలు జాతర పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్

అక్షరదర్బార్, హనుమకొండ: ఐనవోలు జాతరకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లను పూర్తిచేసి జాతర విజయవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. హనుమకొండ జిల్లా ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 13 నుండి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఐనవోలు మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ముందుగా ఆలయానికి వచ్చిన జిల్లా కలెక్టర్ కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు శేష వస్త్రాలను అందించి ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్, ఆర్డీఓ రాథోడ్ రమేష్, ఈవో కందుల సుధాకర్, డీపీవో లక్ష్మీ రమాకాంత్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, ఎస్సై శ్రీనివాస్, ఏఈలు రవికుమార్, సురేష్ కుమార్, ఆలయ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# చిట్యాలలో ఘనంగా మిట్టపల్లి జన్మదిన వేడుకలు

అక్షర దర్బార్, చిట్యాల : మిట్టపల్లి మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు పుల్ల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత మట్టితల్లి మిట్టపల్లి సురేందర్ జన్మదిన వేడుకలను చిట్యాల మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్యాల మండల కేంద్రంలో కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేసి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్ల సతీష్ కుమార్ మాట్లాడుతూ మిట్టపల్లి సురేందర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, సినీ రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి మిత్రమండలి సభ్యులతో పాటు ఆసుపత్రి డాక్టర్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, డ్యూటీ డాక్టర్ నివేదిత, ఆసుపత్రి సిబ్బంది, కటుకూరి నరేందర్, చంద్రశేఖర్, ఉప్పుల కిరణ్, కుమార్, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మరణాలు
- ఎవరూ మద్యం తాగి వాహనాలు నడపొద్దు
- తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..
- యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- హనుమకొండలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు షురూ
- పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

అక్షరదర్బార్, హనుమకొండ : ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తేనే ప్రాణాలు పదిలంగా ఉంటాయని, ప్రతి వాహనదారుడు క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆయన పోలీసు సిబ్బందితో కలిసి హనుమకొండలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన భాగస్వామి అయ్యారు. స్వయంగా ఆయన హెల్మెట్ ధరించి బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. పరేడ్ మైదానం వద్ద మొదలైన ర్యాలీ ఎస్ఆర్ కళాశాల వరకు సాగింది. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావే



శంలో కమిషనర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు నేడు పెద్ద సమస్యగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడమే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోందని, హత్యల కన్నా రోడ్డు ప్రమాదాల వల్ల మరణించే వారి సంఖ్య అధికంగా ఉండటం విచారకరమని పేర్కొన్నారు. పోలీసులు, ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినా వాహనదారులు వ్యక్తిగత బాధ్యతగా భావించినప్పుడే ప్రమాదాలకు చెక్ పెట్టగలమని కమిషనర్ స్పష్టం చేశారు. గత ఏడాది కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల కారణంగా 450 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, 9 లక్షల మంది వాహనదారులకు హెల్మెట్ ధరించని కారణంగా జరిమానాలు విధించాల్సి వచ్చిందని వివరించారు. మద్యం తాగి వాహనం నడపటం వల్ల డ్రైవర్లతో పాటు ఇతరులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారని, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులను కోరుతూ, కుటుంబ సభ్యుల కోసం సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. రోడ్డు భద్రతతో పాటు నేటి యువతకు మత్తుపదార్థాలు, సైబర్ నేరాలు కూడా పెద్ద సవాళ్లుగా మారాయని హెచ్చరించారు.

# బూటకపు మాటలతో నర్సంపేట అభాసుపాలు

- ఎమ్మెల్యే మాధవ రెడ్డి
- నర్సంపేటను అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే

అక్షర దర్బార్, నర్సంపేట :
గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అబద్ధపు మాటలు, బూటకపు ప్రచారాలతో నర్సంపేట నియోజకవర్గాన్ని అభాసుపాలు చేశారని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నర్సంపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నర్సంపేటను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు పట్టణంలో విస్తృత అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో ఇద్దరు చైర్మన్లు, ఎమ్మెల్యే ఉన్నా పట్టణంలో కనీస అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే సుమారు రూ.80 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం జరుగుతోందన్నారు. పోలీస్ స్టేషన్ నుంచి మాదన్నపేట వరకు 60 అడుగుల సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.9 కోట్లు, అంతర్గత పట్టణ అభివృద్ధికి రూ.40 కోట్లు, మహేశ్వరం నుంచి పర్ష నాయక్ తండ వరకు సీసీ రోడ్లు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్‌కు రూ.10 కోట్లు, ముగ్ధంపురం



రాజపల్లె వరకు అభివృద్ధి పనులకు రూ.8 కోట్లు మంజూరు చేసి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జీవోలు, టెండర్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బిల్లులు క్లియర్ చేసి రూ.150 కోట్లతో మెడికల్, నర్సింగ్ కాలేజీలకు సీఎం చేతుల మీదుగా శిలాఫలకం వేయించామని తెలిపారు. అలాగే రూ.9 కోట్లతో ఆసుపత్రికి ఆధునిక పరికరాల కోసం ఆమోదం తీసుకొచ్చామన్నారు. నర్సంపేట పట్టణానికి నిరంతర తాగునీరు అందించేందుకు అశోక్‌నగర్ డీ-ఫ్లోరైడ్ ప్రాజెక్టు పునరుద్ధరణకు రూ.9 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. అభివృద్ధి అంటే కాంగ్రెస్, మాట ఇస్తే చేసి చూపిస్తామని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు, చైర్మన్లు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

### రబీ పంట కోసం పాఖాల తూముల గేట్లు ఎత్తివేత

అక్షర దర్బార్, ఖానాపూర్ : రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం రబీ సీజన్ పంట సాగు కోసం రైతులకు ఖానాపూర్ మండలం పాఖాల తూముల గేట్లను ఎమ్మెల్యే మాధవరెడ్డి స్థానిక రైతులతో కలిసి ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన చెప్పారు, కాలువలలోని చెత్త, చెదారాన్ని తొలగించేందుకు నిధులు కేటాయించామని, రూ.130 కోట్లతో కాలువల లైనింగ్ పనులను మే నెల నుంచి ప్రారంభించి వర్షాల ముందుకు 60 శాతం పనులు పూర్తి చేస్తామని తెలిపారు. మిగతా పనులు వచ్చే సంవత్సరం రబీ పంటకు ముందే పూర్తి చేస్తామన్నారు. రైతన్నల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## నిరుపేద రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం

అక్షర దర్బార్, వెంకటాపూర్ : వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామానికి చెందిన నిరుపేద రైతు ల్యాదేళ్ల నరేష్ – రేణుక కుటుంబానికి సుమారు 50 వేల రూపాయల ఆర్థిక సహాయంతో కిరాణా షాప్ ఏర్పాటు చేశారు. ఈ సహకారానికి రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ (ఆర్‌డీఎస్‌ఎస్) మరియు రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ ప్రతినిధి కర్ణాటక సమ్మయ్య తోడ్పాటున ఆపన్న హస్తం అందజేశారు. గత సంవత్సరం అప్పుల బాధతో రైతు నరేష్ ఆత్మహత్యకు పాల్పడ్డ నేపథ్యంలో మృతుడి కుటుంబానికి రైతు స్వరాజ్య వేదిక అండగా నిలిచింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బొమ్మకంటి వంశావతి–రమేష్, ఉపసర్పంచ్ కొండా తిరుపతి, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కొండల్ రెడ్డి, ఐలన్న, సంజీవ్, గ్రామస్థులు ఓదెలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలి

- ఇంటెలిజెన్స్ ఎస్పీ రమేష్
- విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

అక్షర దర్బార్, వెంకటాపూర్ :
విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఇంటెలిజెన్స్ ఎస్పీ దండుగుడు రమేష్ అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆయన జడ్పీహెచ్ఎస్ (1987 బ్యాచ్) పూర్వ విద్యార్థి కావడం విశేషం. ఈ స్టడీ మెటీరియల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక, మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు జనగాం బాబురావు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రమేష్‌తో పాటు ఎస్పీ శ్యాంబాబు జూమ్ మీటింగ్ ద్వారా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, ఇష్టపడి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. చిన్న చిన్న లోపాలను సవరించుకొని విద్యలో రాణించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ చైర్మన్ ఫరీనా, విద్యార్థులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి పోటీలకు జూకల్ విద్యార్థి ఎంపిక

అక్షర దర్బార్, చిట్యాల : ఈఎల్టీఏ భూపాలపల్లి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఈఎల్టీఏ ఇంగ్లీషు ఒలింపియాడ్‌లో జూనియర్ విభాగంలో జూకల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి మామునూరి నిశాంత్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ఘనంగా అభినందించారు. విద్యార్థి ప్రతిభకు దిశానిర్దేశం చేసిన గైడ్ టీచర్ సాదు మమత, ఆంగ్ల భాషా ఉపాధ్యాయురాలిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ అభినందన కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ భూపాలపల్లి ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి లక్ష్మీ ప్రసన్న, ఈఎల్టీఏ జిల్లా–రాష్ట్ర బాధ్యులు బాల శౌరి రెడ్డి, ఉపాధ్యాయులు వీరన్న, తిరుపతి, గిరిధర్, మమత తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర చీఫ్ ను కలిసిన ఎర్ర రామన్న



అక్షరదర్బార్, పరకాల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు వచ్చిన సందర్భంగా జిల్లా నాయకుడు ఎర్రం రామన్న ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులతో కలిసి రాష్ట్ర చీఫ్‌కు శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎర్రం రామన్న మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి జిల్లాకు రావడం శుభ పరిణామమని అన్నారు. ఆయన పర్యటనతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలం మరింత పుంజుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు

## నూతన పాలకవర్గానికి సన్మానం

అక్షరదర్బార్, పరకాల : ముస్త్యాలపల్లి గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గాన్ని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మేకమల్ల వెంకటేష్, ఉపసర్పంచ్ బోట్ల శ్యామలతో పాటు వార్డు సభ్యులను ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కందుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం గ్రామ పంచాయతీ పూర్తి సహకారం అందించాలని తెలిపారు. సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. అనంతరం సంక్రాంతి సందర్భంగా మహిళలు, విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పావని, సత్యపాల్ పాల్గొన్నారు.





## మున్సిపల్ ఎన్నికల్లో సరైన అభ్యర్థులను గెలిపించాలి

అక్షర దర్బార్, నర్సంపేట : మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోని పాలక పార్టీలు, ఓట్లు, సీట్లు, అధికారం కోసం మాత్రమే ప్రలోభ పెడుతున్నారని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ హెచ్చరించారు. శుక్రవారం నర్సంపేటలో ఓంకార్ భవన్‌లో ఈ పార్టీ నగర ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రధాన అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పాలకుల విధానాల వల్ల వ్యవసాయం దివాలా తీస్తూ గ్రామీణులు పట్టణాలకు వలస వచ్చేస్తున్నారని, ఈ సమస్యలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైపోతున్నారని అన్నారు. అదనంగా, అభివృద్ధి నిధులు కేటాయించినా అవి కేవలం ఎవరి జేబులు నింపేందుకు వినియోగిస్తారనే పరిస్థితి కనిపిస్తుందని చెప్పారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగ సుధా, పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, మాదన్నపేట మాజీ సర్పంచ్ కర్నే సాంబయ్య, పట్టణ నాయకులు వీర్ల రాజు, స్వరూప పుట్టపాక, సునీత చామంతుల, రతన్ పిట్టల, యాకయ్య గడ్డం, పవన్ బెజ్జంకి, రాజేష్, విజయ, రవి, రమేష్, సదానందం, పద్మ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



## బడికి రాని విద్యార్థుల ఇళ్ల సందర్శన

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలోని నైన్‌పాక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరచూ గైర్హాజరయ్యే విద్యార్థుల ఇళ్లను చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి చదువు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఆర్. ఊర్మిళ, ఎస్సై శాఖాన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిత్యం పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరి ఏ ఎస్సై భూపాలపల్లి, కానిస్టేబుళ్లు అశోక్, శ్రీనివాస్, మౌనిక, క్రాంతికుమార్, చైల్డ్ వెల్ఫేర్ అధికారి సోషల్ కుమార్, ఎన్జీవో ప్రతినిధి కోమలతో పాటు ఉపాధ్యాయులు సుధాకర్, ప్రణీత, పల్లవి, ప్రవీణ్ కుమార్, రాజయ్య, ప్రసాద్, నాగరాజు, విజయవర్ధన్ రెడ్డి, లోక శ్రీనివాస్, కోటేశ్వరరావు, ఓదెలు, సీఆర్పీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ లోనే కొనసాగుతున్నా..

అక్షర దర్బార్, పరకాల : బీఆర్ఎస్ నడికూడ మండల అధ్యక్షుడు దురిశెట్టి వెంకటేష్ (రేవంత్) తనపై ఇటీవల వస్తున్న తప్పుడు ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. ఆయనపై పార్టీ మారుతున్నట్టు చేస్తున్నదంతా అసత్యమని స్పష్టం చేశారు. "బీఆర్ఎస్ నా కుటుంబం. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నా నాయకుడు. ఎప్పటికీ అదే పార్టీ, అదే నాయకుడి వెంట ఉంటా. అధికారంలో ఉన్నా లేకపోయినా బీఆర్ఎస్‌తోనే కొనసాగుతానని సాధారణ కార్యకర్తగా కూడా పని చేయడానికి సిద్ధంగా ఉన్నాను." బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు ఇలాంటి అబద్ధాలను నమ్మకూడదని కోరారు.

## రామప్పను సందర్శించిన హిమాచల్ విద్యాశాఖ మంత్రి

అక్షర దర్బార్, వెంకటాపూర్ : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పాలంపేట రామప్ప దేవాలయాన్ని హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ ఠాగూర్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమశంకర్‌లు ఆయనకు స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ మండపంలో అందజేశారు. ఆలయ అధికారులు మంత్రిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామప్ప దేవాలయం అత్యంత సుందరమైనదని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంపత్, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఆలయ అధికారులు, వెంకటాపూర్ ఎస్సై చల్లా రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారులకు ఆలయ చరిత్ర వివరణ

పాలంపేటలోని రామప్ప దేవాలయాన్ని సిద్ధిపేట జిల్లా ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ గైడ్ వెంకటేష్ విద్యార్థులకు రామప్ప దేవాలయ శిల్పకళా ప్రాముఖ్యత, చరిత్రను వివరించారు.



# వచ్చే నెలలో సీఎం వచ్చే ఛాన్స్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- కొడవటంచ దేవస్థానం అభివృద్ధి పనుల పరిశీలన



అక్షరదర్బార్, రేగొండ: ఈ నెలాఖరు వరకు కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి రెవెన్యూ, దేవాదాయ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్తు శాఖల అధికారులతో దేవాలయ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 12వ తేదీలోగా అందజేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే ఇప్పటికే చేపట్టిన పనులకు సంబంధించిన ఎంబీ రికార్డును ఈ నెల 19వ తేదీలోగా పూర్తి చేయాలని దేవాదాయ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సమీక్షకు ముందు దేవాలయ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించి, పనుల నాణ్యత, వేగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చే నెలలో దేవాలయానికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చే అవకాశం ఉందని, ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ ఈఈకి సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టిన అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు పనుల కొరకు ప్రతిపాదనలు, పూర్తి అయిన పనులకు ఎంబి రికార్డులను అందచేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, పిఆర్ ఎస్ఈ చక్రవర్తి, దేవాదాయశాఖ ఈఈ దుర్గప్రసాద్, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ శ్వేత, ఆర్అండ్‌బి ఈఈ రమేష్, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఎఫ్డిఓ అప్పలకొండ, తహసీల్దార్ శ్వేతా, దేవస్థానం ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరకాల మున్సిపాలిటీలో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి



అక్షరదర్బార్, పరకాల : పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించి బీజేపీని ఓడించాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రెండో వార్డులో పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ప్రజా సమస్యలు ఎజెండాగా పరిష్కారం కావాలంటే సీపీఎం అభ్యర్థులు గెలవాల్సిందేనని తెలిపారు. గాదె ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ పాలనలో పేదలు, కష్టజీవులకు నష్టం కలిగే విధానాలు అమలవుతున్నాయని, ఉపాధి హామీ చట్టం నిరవీర్యం చేయబడిందని, ధరల పెరుగుదల, మహిళలపై దాడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అందుకే ఎన్నికల్లో బీజేపీని ఓడించి సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సదరు సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోట్ల చక్రపాణి, మడికొండ ప్రశాంత్, బొచ్చు ఈశ్వర్, బొచ్చు రాజు, దశకుటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



అక్షర దర్బార్, దుగ్గొండి : నాచినపల్లి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని గ్రామ సర్పంచ్ పెండ్యాల రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ఎల్. శారద రైతులను ఉద్దేశించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెక్స్ సార్టెడ్ సీమన్ వినియోగంపై అవగాహన కల్పించారు. పశువులకు మినరల్ మిక్సర్, పోషక పశుగ్రాసాలు అందించాలని సూచించారు. శిబిరంలో మొత్తం 74 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి నట్టల నివారణ, చుడి నిర్ధారణ, గర్భకోశ వ్యాధుల చికిత్సలు, కృత్రిమ గర్భధారణలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, గోపాలమిత్రులు, గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితులకు జైలు శిక్ష, జరిమానాలు

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వ్యక్తులకు పరకాల ఇన్‌చార్జి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీవల్లి శైలజ శిక్షలు విధించినట్లు ఎస్సై జె. పరమేశ్వర్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గుండ్లె సింగారం గ్రామానికి చెందిన మేదాసి ఐలేష్‌కు రూ.1,500 జరిమానాతో పాటు మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. అలాగే నర్సంపేటకు చెందిన పరిచకపు రమేష్, హన్మకొండకు చెందిన మంచిపెల్లి బాను ప్రసాద్‌లకు ఒక్కొక్కరికి రూ.2,200 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. మరోసారి మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపిస్తామని మేజిస్ట్రేట్ హెచ్చరించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## టీచర్లకు టెట్ పరీక్ష రద్దు చేయాలి..

### టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి

అక్షర దర్బార్, పరకాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ టీపీటీఎఫ్ పిలుపు మేరకు గురువారం దేశవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. నడికూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ సేవలో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు, జాతీయ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమికోపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## ప్రపంచానికి చాటేలా

# మేడారం మహా జాతర

- సమ్మక్క- సారక్కల ఘన కీర్తిని చాటిచెప్తాం
- ఆదివాసీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుకలు
- జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం
- 19న సీఎం చేతుల మీదుగా మేడారం అభివృద్ధి పనులు ప్రారంభం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- మేడారంలో మీడియా ఆత్మీయ సమ్మేళన సమావేశం

అక్షరదర్బార్, మేడారం : వన దేవతలైన సమ్మక్క– సారక్కల ఘన కీర్తిని యావత్ ప్రపంచాటేలా మేడారం మహా జాతర నిర్వహిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. త్వరలో జరగనున్న మహా జాతర సందర్భంగా శుక్రవారం ఆమె ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం లోని హరిత హోటల్ లో కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తో కలిసి నిర్వహించిన మీడియా ఆత్మీయ సమ్మేళన సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ చరిత్రలోనే మేడారం జాతర మైలురాయిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. సృష్టికి ఆదివాసులే మూల పురుషులని ఆమె పేర్కొన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, గోత్రాలు, ప్రాచీన ఆచారాలు ప్రతిబింబించేలా మేడారం ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ పనులు చేపట్టామని తెలిపారు. మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించారని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.251 కోట్లు భారీ నిధులు కేటాయించారని వెల్లడించారు. ప్రస్తుతం జాతర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నట్లు వివరించారు. భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా, ఇలవేల్పులుగా సమ్మక్క సారలమ్మలు ప్రసిద్ధి చెందారని కొనియాడారు. రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమి వెన్నెల వెలుగుల్లో గిరిజన డోలు వాద్యాల నడుమ వన దేవతలు గద్దెపైకి వచ్చే అద్భుత ఘట్టం కోసం కోట్లాది మంది భక్తులు ఎదురుచూస్తున్నట్లు వివరించారు. భక్తుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు.

**- 18న మేడారానికి సీఎం రేవంత్**

గద్దెల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఈ నెల 19వ తేదీ ఉదయం 7 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని, అంతకుముందు రోజు సాయంత్రమే ముఖ్యమంత్రి మేడారం చేరుకుంటారని మంత్రి ప్రకటించారు. ఆలయ పునరుద్ధరణ విషయంలో గిరిజన పెద్దలు, పూజారులు, ఆదివాసీ సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అందరి సమ్మతితో కూడిన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రణాళికలో ప్రతి అంశం గిరిజన మూలాలను గౌరవించేలా ఉంటుందని, అందరి సంతకాలతోనే ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక చేయూతనిచ్చేలా జాతరలో బొంగు చికెన్, ఇప్పపువ్వు లడ్డు వంటి ప్రత్యేక ఆహార పదార్థాల విక్రయ దుకాణాలకు ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు. జాతర నిర్వహణలో జిల్లా యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోందని, జాతర సమయంలో సుమారు 30 వేల మంది సిబ్బంది భక్తులకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జాతర ప్రాంతాన్ని 8 జోన్లు, 42 సెక్టార్లుగా విభజించి ప్రతి జోన్‌కు ఎనిమిది మంది అధికారులను నియమించి పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తాడ్వాయి– మేడారం, పస్రా–మేడారం రహదారుల వెంట ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. సుమారు 20 మంది ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

**- ప్రత్యేకమైన డ్రోన్లతో నిఘా**

450 సీసీ టీవీలు, 20 ప్రత్యేక డ్రోన్ల నిఘాతో జాతర పరిసరాలను నిరంతరం గమనిస్తామని తెలిపారు. తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హీట్ మ్యాప్ టెక్నాలజీని ఉపయోగించి జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రతి కదలికను పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బంది కలగకుండా క్రౌడ్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తామని వివరించారు. వాహనాల పార్కింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి కావచ్చాయని, స్థానిక యువత పెద్ద ఎత్తున స్వచ్ఛంద సేవకులుగా పాల్గొంటున్నారని తెలిపారు. శాశ్వత అభివృద్ధి పనులు, జాతర నిర్వహణ అంశాలను మీడియా ప్రతినిధులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి అనసూయ సీతక్క కోరారు. కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జాతర నిర్వహించడం జరుగుతుందని, జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. జాతర లో ప్రస్తుతం 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని , జాతర సమయం లో 30 వేల మంది సిబ్బంది, జాతర అనంతరం 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. జాతర ప్రాంతాన్ని 8 జోన్స్ గా, 42 సెక్టార్లుగా విభజించి ప్రతి జోన్ లో 8 మంది అధికారులు ఉంటారని అన్నారు. సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- ఇంటి నంబర్ కేటాయింపునకు డబ్బులు డిమాండ్
- బాధితుడి నుంచి రూ.6 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత
- సూర్యాపేట జిల్లా గానుగబండలో ఘటన



అక్షరదర్బార్, సూర్యాపేట : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గానుగబండ పంచాయతీ కార్యదర్శి క్రిష్ణ బాధితుడి నుంచి రూ.6 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. గ్రామస్థుడు ఒకరు తాను నిర్మించుకున్న ఇంటికి ఇంటి నంబర్ కేటాయించాలని కోరాని పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాడు. సదరు అధికారి ఆ పని కోసం నగదు డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగింది. శుక్రవారం ఉదయం బాధితుడి నుంచి పంచాయతీ కార్యదర్శి తన కార్యాలయంలో రూ.6 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడు తీసుకున్న సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణను హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టు అడిషనల్ స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపరిచారు. పంచాయతీ కార్యదర్శి పట్టివేతతో తుంగతుర్తి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది.



## లక్నేపల్లి సర్పంచ్ కు సన్మానం

అక్షర దర్బార్, నర్సంపేట రూరల్ : ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో లక్నేపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన రజిత అశోక్‌ను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ దంపతులు శాలువాతో సత్కరించారు. శుక్రవారం నర్సంపేట పట్టణంలోని బాలాజీ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ మోర్తాల రామ్ రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో చైర్మన్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ వనజ సర్పంచ్ దంపతులు పాల్గొన్నారు. చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. తమ విద్యాసంస్థలలో ఎన్నో ఏళ్లుగా విద్యాబోధకుడిగా పనిచేసిన రజిత అశోక్ లక్నేపల్లి గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నిక కావడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మరిపెడలో అగ్నిప్రమాదం

అక్షర దర్బార్, మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని సెవెన్ హిల్స్ బార్ అండ్ రెస్టారెంట్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదంలో రెస్టారెంట్‌లోని ఫర్నిచర్, విద్యుత్ సామగ్రి, ఇతర వస్తువులు దగ్ధమై భారీ ఆస్తినష్టం చోటుచేసుకుంది. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అధికారులు ఈ ఘటనకు సంబంధించిన పూర్తి విచారణను కొనసాగిస్తున్నట్లు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## బాల్య మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం

అక్షర దర్బార్, శాయంపేట : 1982–83 పదోతరగతి బ్యాచ్ మిత్రుడు మంత్రి రవీందర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, తోటి మిత్రులు ఆయన కుటుంబానికి రూ.51,050 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వలపుదాస్ రమేష్, బాసని జయప్రకాశ్, గౌరోజు రాజేంద్ర ప్రసాద్, బొల్లోజు రవీంద్ర చారి, పసునూటి ప్రకాష్, వినుకొండ శంకరాచారి, రేణికుంట్ల ఐలయ్య, బాసని సంబయ్య, దామరకొండ కుమారస్వామి, దుబాసి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

- బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్ రావు
- ములుగులో రోడ్ షో



అక్షర దర్బార్, ములుగు: రాష్ట్రంలో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ములుగు జిల్లాలో పర్యటించారు. జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రోడ్‌షోలో రాంచందర్ రావు మాట్లాడుతూ.. ములుగు జిల్లా గిరిజన, వెనుకబడిన ప్రాంతమని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచి ప్రధాన మంత్రి సమ్మక్క–సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేశారని తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తే, కేంద్ర ప్రభుత్వ నిధులతో ములుగు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వీరేందర్ గౌడ్, గౌతం రావు, రాష్ట్ర కోశాధికారి వాసుదేవ రావు, జిల్లా ఇంచార్జి కొరదాల నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతలపూడి భాస్కర్ రెడ్డి, భూక్యా రాజు నాయక్, భూక్యా జవహర్ లాల్, గుగులోతు స్వరూప పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915